క్లుప్తంగా

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి



ఎల్లారెడ్డి : పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డిలో పారిశుద్ధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు సక్రమంగా పనులను చేయాలన్నారు.

నర్సన్నపల్లిలో కేంద్ర బృందం పర్యటన



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం నర్సన్నపల్లిలో బుధవారం కేంద్ర ప్రభుత్వ సచివాలయ ఉద్యోగులు ఏఎస్‌వో (అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్) బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా నర్సన్నపల్లి గ్రామ శివారులోని ఆర్టీవో కార్యాలయాన్ని సందర్శించారు. వాహనాల రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌ల జారీ విధానాన్ని తెలుసుకున్నారు. గ్రామంలో ఉపాధిహామీ పనులను, కూలిని తెలుసుకున్నారు. రేషన్‌షాప్‌లను పరిశీలించారు. జీపీల్లో పింఛన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు, ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి నవనీత తదితరులు ఉన్నారు.

కథలు, ప్రశ్నావళి పోటీల్లో పద్మావతి ప్రతిభ



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ గ్రామానికి చెందిన కందాళ పద్మావతి తనదైన శైలిలో కవితలు రాస్తూ సాహితీ అభిమానులను ఉత్తేజపరుస్తున్నారు. రాజమహేంద్రవరంలోని గోదావరి రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కవితలు, ప్రశ్నావళి పోటీలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. 14వ ఏట పెళ్లి చేసుకున్న ఆమె తెలుగులో డిగ్రీ పూర్తి చేసి సాహితీ వనంలో విరబూసిన పద్మంలా వికసిస్తున్నారు. గతంలో ఎన్నో సాహితీ కార్యక్రమాల్లో పాల్గొని పలు అవార్డులు కైవసం చేసుకున్నారు. డాక్టర్ సినారెతో ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా చుక్కాపూర్ గ్రామస్తులు బుధవారం కవయిత్రి పద్మావతిని అభినందించారు.

కంపోస్టు షెడ్ల పరిశీలన



కామారెడ్డి రూరల్ : గ్రామాల్లోని కంపోస్టు షెడ్డుల నిర్వహణను మెరుగు పర్చుకోవాలని ఎంపీవో మలహరి సూచించారు. బుధవారం మండలంలోని చిన్నమల్లారెడ్డి, కోటాల్‌పల్లి, లింగాయిపల్లి గ్రామాల్లో గ్రామాల్లో కంపోస్టు షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడి చెత్త వేర్వేరుగా ట్రాక్టర్‌ల ద్వారా సేకరించి కంపోస్టు షెడ్డులో వేసి ఎరువులను తయారు చేయాలన్నారు. కార్యదర్శులు అనిల్, గంగుబాయి, మౌనిక తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : క్రీడలతో మానసిక ఉల్లాసమే కాకుండా ఆరోగ్యంగా ఉంటారని జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి అన్నారు. తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న వాలీబాల్ సమ్మర్ క్యాంప్‌ను పరిశీలించారు. ఈ క్యాంప్ ఈనెల 31వతేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు నారాయణ, వెంకట్‌రెడ్డి, హైమద్, సతీష్ నాగరాజు, పాఠశాల హెచ్‌ఎం చంద్రవతి, పీఈటీ బాలు తదితరులున్నారు.

నేడు ఎల్లారెడ్డిలో కంటి వైద్య శిబిరం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి శిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్రమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లయన్స్ క్లబ్ బాన్సువాడ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తీరుమారని ఆస్పత్రితో ఇబ్బంది

- అధ్వానంగా పిట్లం పీహెచ్‌సీ
- సరిపడా వైద్యులు లేక అందని వైద్యసేవలు
- అందుబాటులో లేని అంబులెన్స్



పిట్లం పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్త



పిట్లంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పిట్లం(జుక్కల్) : ఉమ్మడి జిల్లాలోనే మొదటి ఆరోగ్య కేంద్రమైన పిట్లం పీహెచ్‌సీ ప్రస్తుతం సమస్యల వలయంలో చిక్కుకుంది. పిట్లం పీహెచ్‌సీ తర్వాత ఎన్నో పీహెచ్‌సీలు పెద్దాస్పత్రులుగా మారినా ఈ పీహెచ్‌సీ పరిస్థితిలో మాత్రం ఏ మార్పు లేదు. 40 ఏళ్లుగా ఎలాంటి మార్పు లేకపోవడంతో రోగులు అవస్థలు తప్పట్లేదు. గత ప్రభుత్వం నూతన ఆస్పత్రి భవనం మంజూరు చేసి నప్పటికీ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పిట్లం ఆస్పత్రి 30 పడకల ఆస్పత్రిగా చెలామణి అవుతోంది. పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్ మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లా కల్హేర్, కంగ్టి మండలాల నుంచి ప్రతి రోజు 200కు పైగా రోగులు వస్తుంటారు. ఆస్పత్రిలో ఆరుగురు వైద్యులు అవసరం ఉండగా ప్రస్తుతం ఒక వైద్యుడు, ఒక డెంటల్ డాక్టర్ మాత్రమే ఉన్నారు. సరిపడ వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రికు వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా సమయానికి వైద్యులు రాక ఆస్పత్రిలోని ఉన్నటువంటి ఆయూష్ హోమియోపతి ఆస్పత్రి, కంటి వైద్య ఆస్పత్రి ఎప్పుడు మూసి ఉండడంతో చికిత్స కోసం వచ్చిన రోగులు తిరిగి వెళ్లిపోతున్నారు. అత్యవసర పరిస్థితిలో బాన్సువాడ, నిజామాబాద్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. ఆస్పత్రి ఆవరణలో చెత్తచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు స్పందించి పిట్లం ప్రభుత్వ ఆస్పత్రిలోని సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

రాత్రయితే కష్టమే..



రాత్రి పూట ఏదైన అత్యవసరమైతే భయపడాల్సిన పరిస్థితి ఉంది. పిట్లంకు ఆనుకొని జాతీయ రహదారి ఉండడంతో తరచూ రోడ్డు ప్రమదాలు జరుగుతున్నాయి. దీంతో ఆస్పత్రిలో రోగులు లేకపోవడంతో క్షతగాత్రులకు సరైన సమయానికి వైద్యం అందటం లేదు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి పిట్లం ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరిస్తే బాగుంటుంది.

– ఖదీర్, పిట్లం

పనులు పూర్తిచేయాలి



పిట్లంలో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం పనులు త్వరగతిన పూర్తి చేసి రోగులకు ఆస్పత్రిని అందుబాటులో తెస్తే బాగుంటుంది. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనంలో సరైన సౌకర్యాలు లేవు. ఒకేసారి ఎక్కువ మంది రోగులు వస్తే గదులు లేక వరండాలో వైద్యం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితి వస్తే బాన్సువాడకు పంపిస్తున్నారు.

– వెంకట్‌రెడ్డి, పిట్లం

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

- ఎస్పీ సింధుశర్మ



ఉత్తమ సేవలకు అవార్డును అందజేస్తున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం : నేరాల నియంత్రణకు కృషి చేయాలని ఎస్పీ సింధుశర్మ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షను బుధవారం ఏర్పాటు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్‌బెట్టింగ్, జూదం, మట్కా లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా జరిగిన కేసులలో విచారణను వేగవంతంగా పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ లను దాఖలు చేయాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో అణిచివేయాలని సూచించారు. ప్రతి కేసులో 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడే విధంగా, బాధితులకు న్యాయం జరిగేలా పని చేయాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై యువత తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోనూ ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాలు తరచుగా జరిగే ప్రదేశాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి నివారణా చర్యలు చేపట్టాలన్నారు. డ్రంకన్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈ నెలకు సంబంధించి విధుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి అవార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ట్రెయినీ ఐపీఎస్ కాజల్ సింగ్, డీఎస్పీలు నాగేశ్వరరావు, సత్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో ఆరోగ్య శాఖ సిబ్బంది బుధవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో డెంగీతో పదేళ్ల బాలుడు మణిదీప్ మృతి చెందడంతో కాలనీలో ఆరోగ్య సిబ్బంది మెడికల్ క్యాంప్ నిర్వహించి పలువురి బ్లడ్ సాంపిల్స్‌ను తీసుకున్నారు. దోమలు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి డిప్యూటీ డీఎంహెచ్‌వో కాలనీవాసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్, సిబ్బంది తదితరులున్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల పరిశీలన



అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలిస్తున్న సెక్రటేరియట్ టీం సభ్యులు

రామారెడ్డి : గ్రామాల్లో మౌలిక వసతులను సెంట్రల్ సెక్రటేరియట్ టీం సభ్యులు బుధవారం పరిశీలించారు. సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడ జీపీని, అంగన్‌వాడీ సెంటర్‌ను టీం సభ్యులు పరిశీలించి గ్రామస్తుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని 4 రోజుల పాటు సందర్శించి వివిధ అభివృద్ధి పనులు, మౌలిక వసతుల వివరాలను గ్రామస్తుల నుంచి సేకరించిపై అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. బుధవారం అంగన్వాడీ సెంటర్ ను సందర్శించి వివరాలు ఆరా తీశారు.

గాయత్రి షుగర్ ఫ్యాక్టరీని, మిషన్ భగీరథ గ్రిడ్ మర్కల్‌లో ఏఈ ద్వారా పూర్తి వివరాలు సేకరించారు. ధర్మారావుపేట్ జీపీ పరిధిలోని సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏపీవో మధు, జీపీ కార్యదర్శి ప్రశాంత్ , జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల సర్వే



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయిలాపూర్, లింగంపేట గ్రామాల్లో బుధవారం ఐఈఆర్‌పీలు శ్యామల, అశ్విని దివ్యాంగుల సర్వే నిర్వహించినట్లు తెలిపారు. 18 ఏళ్ల నిండి ప్రత్యేక అవసరాల పిల్లలను ఇంటింటికీ వెళ్లి గుర్తిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దివ్యాంగులను గుర్తించి భవిత సెంటర్లలో పేరు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. గుర్తించిన పిల్లకు రవాణా భత్యం, ప్రత్యేక ఉపకరణాలు, సమ్మిళిత విద్యా, సదరం సర్టిఫికెట్లు, దివ్యాంగులకు ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. సర్వేలో ఐఈఆర్‌పీలు, ఏఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన బీజేపీ నేతలు



నిజాంసాగర్(జుక్కల్) : జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను బుధవారం హైదరాబాద్‌లో జుక్కల్, మహమ్మద్ నగర్ మండలాల బీజేపీ నేతలు కలిశారు. ఆయా మండలాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిని తెలియపరుస్తూ ఎంపీ బీబీ పాటిల్‌కు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో లింగాల శంకర్‌పటేల్, నీలుపటేల్, రాములు సేట్, మాదవ్‌రావ్‌దేశాయ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



పిట్లం(జుక్కల్): మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదగిరి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలతో చెరువులో పూడికతీత పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ, ఉపాధీ హామీ సిబ్బంది ఉన్నారు.

విద్యావిప్లవం సృష్టికర్త భాగ్యరెడ్డి వర్మ



భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం : అణగారిన వర్గాలకు మెరుగైన విద్యను అందించి విద్యా విప్లవం సృష్టించిన మహనీయుడు భాగ్యరెడ్డి వర్మ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో బుధవారం భాగ్యరెడ్డి వర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ దళిత బాలికల కోసం పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేసిన మహనీయుడు భాగ్యరెడ్డి అన్నారు. మహనీయుల జీవిత చరిత్రను బాల బాలికలకు తెలియ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



భిక్కనూరులో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్‌రావు



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేందర్

భిక్కనూరు : తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధ ప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు ఆదేశించారు. బుధవారం ఆయన భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలను అందించాలన్నారు. ఉపాధి కూలీలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ఉపాధి పనులు జరిగేచోట ఎండ నుంచి కూలీలకు ఇబ్బంది కలుగకుండా షామీయానాలను ఏర్పాటు చేయడంతో పాటు నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఇంటి పన్నులను వందశాతం వసూలు చేయాలని సూచించారు. ఎంపీడీవో ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ఎల్లారం, ఎల్లమ్మతండా, జగదాంబతండా, సురాయిపల్లి గ్రామా శివారులోని నర్సరీలు, డంపింగ్‌యార్డు, కంపోస్ట్ ఎరువుల షెడ్‌లను బుధవారం ఎంపీడీవో నరేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.



బ్రహ్మజీవాడిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో

తాడ్వాయి మండలంలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కృష్ణాజీవాడి, బ్రహ్మజీవాడి, దేవాయిపల్లి గ్రామ శివారులో ఉన్న నర్సరీని బుధవారం ఎంపీడీవో సయ్యద్‌సాజీద్ అలీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలను నాటాలన్నారు. హరితాహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామంలో ఉన్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. అలాగే డంపింగ్ యార్డులను పరిశీలించి, డంపింగ్ యార్డులను వాడాలని కోరారు. ఆయన వెంట ఎంపీవో హెప్సీబారాణి, గ్రామ కార్యదర్శి, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.



మద్దెలచెరువులో డ్రైయినేజీలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

పిట్లంలో పారిశుధ్యం పరిశీలన

పిట్లం(జుక్కల్) : పిట్లం పీహెచ్‌సీ పరిధిల్లోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల పంచాయతీ అధికారి బ్రహ్మం జీపీ కార్యదర్శులకు సూచించారు. గురువారం మండలంలోని మద్దెలచెరువు జీపీని సందర్శించారు. గ్రామంలో ప్రైవేటు కూలీలు, జీపీ కూలీలతో మురికి కాలువలు శుభ్రం చేయిస్తున్న పనులను పరిశీలించారు.

ఆధ్యాత్మికం

ఘనంగా నృసింహుని జయంతి



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహాస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సేవాకాలం, శాంతి పాఠం ద్వారా తోరణ పూజలు నిర్వహించారు. చతుస్థానార్చన, అగ్ని ముఖం, మూల మంత్ర హవణంలు, అష్టోత్తర శతగటాభిషేకం, పూర్ణాహుతి, బలిహరణ అనంతరం తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్, లక్ష్మణ్, అర్చకులు ఉన్నారు.

ముగిసిన రేణుకా మాత ఉత్సవాలు



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం ఇస్రోజీవాడిలో నాలుగు రోజులుగా జరుగుతున్న రేణుకా మాత ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం తిరుగు బోనాలను ఇంటికి డప్పు చప్పుళ్ల మధ్య తీసుకువెళ్లారు. చక్కెర తీర్థం తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వేద పారాయణం ప్రారంభం



భిక్కనూరు : దక్షిణ కాశీగా పేరొందిన భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో ఉడిపి పండితులు ఆధ్వర్యంలో వేదపారాయణం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉడిపి పంతులు వేద పారాయణ కార్యక్రమాన్ని జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవనామ స్మరణను చేపట్టాలన్నారు. వేదపారాయణంతో పాటు చతుర్వేదపారాయణంను పఠించారు.

ఘనంగా తిరుగు బోనాలు..



దోమకొండ : మండల కేంద్రంలో జరుగుతున్న రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం రాత్రి అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు బుధవారం తిరుగు బోనాలు తీసుకెళ్లారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగభూషణం గౌడ సంఘం అధ్యక్షుడు రాజనర్స గౌడ్, జడ్పీటీసి సభ్యుడు తిరుమల్ గౌడ్ గౌడ సంఘం ప్రతినిధులు బీమా గౌడ్ సుదర్శన్ గౌడ్ ప్రసాద్ గౌడ్ నారా గౌడ్ తదితరులున్నారు.

సంక్షిప్తం

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

భిక్కనూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఎంపీపీ గాలిరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఈ సమావేశానికి ఎంపీటీసీలు, విండో చైర్మన్లు, అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యుడు విధిగా హాజరుకావాలన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగవర్ధన్ తెలిపారు. ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి గౌరవ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామారెడ్డి : సదాశివనగర్ మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఈనెల 25వలోపు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. 2024–25 నుంచి ఇంటర్‌లో విద్యార్థులకు ఎంఈసీ, సీఈసీ, సీఈసీ, ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌కు సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఫస్టియర్‌లో దరఖాస్తులను స్వీకరించడానికి ఈనెల 25 చివరి తేదీగా తెలిపారు.

ప్రారంభానికి నోచుకోని జీపీ భవనం



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : జీపీలకు శాశ్వత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న ఈ రోజుల్లో పోచారం తండా జీపీ నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. భవనానికిసంబంధించి పూర్తి నిధులు కేటాయించకపోవడంతో గుత్తేదారు భవనాన్ని అధికారులకు స్వాధీనం చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్ని గదిలో జీపీ కొనసాగుతోంది.

వేగంగా వాహనాలు నడపొద్దు

మద్నూర్(జుక్కల్): వాహనదారులు లైసెన్స్‌లు లేకుండా మితిమిరినవేగంతో వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మండల కేంద్రానికి సమీపంలోని ప్రధాన రహదారిపై బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు.

ఆలయ అభివృద్ధి కోసం విరాళాలు

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నృసింహా స్వామి బ్రహ్మోత్సాల సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం బుధవారం దాతలు విరాళాలను అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన రాజేశ్వర్ రెడ్డి–పద్మ దంపతులు రూ.10వేలు, కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన నరసింహారెడ్డి–రేవతి దంపతులు రూ. 5వేల విరాళాలను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డికి అందజేశారు.